



ఐలూరు - గుర్విందపల్లి మధ్య కరకట్టపై ప్రమాదకరంగా మారిన గోతులు



అవనిగడ్డ నుంచి విజయవాడ వస్తున్న కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సు

ఐదేళ్లుగా గుంతల్లోనే..

కృష్ణానది కరకట్ట రోడ్డు ప్రమాదకరంగా మారింది. కరకట్టపై తారు రోడ్డు అనేకచోట్ల కుంగిపోంది. భారీగా గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. విజయవాడ వద్ద యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు 58 కిలోమీటర్లుంది. ప్రతిరోజు వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా రివర్ కన్జర్వెన్సీ (ఆర్సీ) అధికారులు రహదారికి మరమ్మతులు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించడం లేదు.

కరకట్టపై ప్రయాణం దినదినగండం | ప్రమాదకరంగా మారిన గుంతలు

- ఇప్పటికే ప్రమాదాల్లో పలువురి దుర్మరణం
- ఐదేళ్ల నుంచి మరమ్మతులు శూన్యం
- ముళ్లచెట్లతో రోడ్డు మార్జిన్ మాయం
- అనధికార జాతీయ రహదారిగా రూపాంతరం
- నిత్యం వేలాది వాహనాల రాకపోకలు
- అయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తోట్లవల్లూరు : కృష్ణానదికి 2009లో భారీ వరదలు సంభవించి కరకట్ట బలహీనపడింది. 2010 - 13 మధ్యలో కట్టను వెడల్పు చేసి డబుల్‌లేన్ రోడ్డుగా పటిష్టపరచి తారురోడ్డు వేశారు. డబుల్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేయటంతో దివిసీమ, తీర గ్రామాల ప్రజలు విజయవాడకు సులువుగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలిగింది. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి తదితర మండలాలు ప్రజలకు కరకట్ట రహదారి అనుసంధానమయింది. దీంతో అవనిగడ్డ డిపో నుంచి విజయవాడకు కరకట్ట మీదుగా కరకట్ట ఎక్స్‌ప్రెస్ పేరుతో ఆర్టీసీ బస్సులు కూడా తిప్పుతున్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున నడుస్తోంది. కార్లు, ద్విచక్ర వాహనాలపై వందల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రేపల్లె నుంచి కూడా అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. కరకట్టపై వాహనాల రాకపోకలను చూస్తే అనధికార జాతీయ రహదారి గుర్తుకు వస్తుంది.

రహదారి ధ్వంసం.. రాకపోకలకు ఆటంకం

కరకట్ట రహదారి ఇసుక లారీల వల్ల అనేక చోట్ల ధ్వంసమైంది.

- పదిటైర్ల లారీల్లో 30 టన్నుల ఇసుకను రవాణా చేయటంతో తారు రోడ్డు కుంగిపోయి గుంతలుగా మారింది.
- గుంతలతో ఒక్క తోట్లవల్లూరు మండలంలోనే ద్విచక్రవాహనాల ప్రమాదాలు 20 వరకు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోయారు.
- ముళ్లకంప మరొక సమస్యగా తయారైంది. ముళ్లకంప, పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డు మార్జిన్ దాటి రోడ్డును కమ్మేస్తున్నా అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం వర్షాకాలంలో ముళ్లకంప సమస్య రోజురోజుకీ ఎక్కువవుతోందని వాహనదారులు చెపుతున్నారు.

నిధుల కోసం ఎదురుచూపులే

కరకట్ట రహదారికి మరమ్మతులు చేసేందుకు రూ.80 లక్షలతో అంచనాలు పంపామని గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్సీ అధికారులు తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చెప్పారు. సంవత్సరాలు గడిచినా నిధులు మంజూరు కాలేదు. గుంతలు అలాగే ఉన్నాయి. ప్రయాణికుల అవస్థలు అలాగే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా కరకట్ట రహదారికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రోడ్డుపైకి పెరిగిన ముళ్ల కంపను తొలగించాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కరకట్టపై కనురెప్పపాటులో ప్రమాదాలు

కరకట్టపై నిత్యం వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో పడి కారు అదుపుతప్పి కేఈబీ కెనాల్లో పడుతున్నాయి. గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొంటున్నాయి.

- ఇటువంటి ప్రమాదాలు అనేకం జరిగాయి. బైక్ ప్రమాదాలకు గురై మండలంలోని కళ్లంవారిపాలేనికి చెందిన కళం కృష్ణారెడ్డి (56), భద్రిరాజుపాలేనికి చెందిన ధర్మారెడ్డి (70) మృతిచెందారు.
- రేపల్లెకు చెందిన ఏసీ వ్యాపారి రొయ్యూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.
- గుర్విందపల్లి శివారు మధునాపురం వద్ద రెండేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు గుంతల్లో అదుపు తప్పి కాలువ వైపునకు దూసుకెళ్లింది.
- చోడవరం వద్ద బస్సు చెట్టుకు ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది. ఇలా అనేక ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.



దేవరపల్లి వద్ద కేఈబీ కెనాల్లోకి దూసుకెళ్లిన కారు (ఫైల్)

భవనం కావలెను!

గతంలో బీడీ వర్తకసంఘం భవనంలో కేటాయించిన గదులు ఇవే

దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయానికి ఏడాదిన్నరగా భవనం సమస్య

- ఫర్నీచర్ లేదు... సిబ్బంది లేరు
- పాత కార్యాలయంలోనే కార్యకలాపాలు
- చింతగుంటపాలెం మీసేవా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పి నిలిపివేత
- అద్దె భవనం కోసం అధికారుల వెతుకులాట

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గంలోని నగర ప్రాంతాన్ని, రెండు మండలాలుగా విభజించాక దక్షిణ మండలానికి తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు నేటికీ జరగలేదు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఉత్తరం మండలానికి వెళుతుంది. దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయం నడిపేందుకు భవనం లేదు. సిబ్బంది కూడా లేరు. ప్రస్తుతం జరిగిన తహసీల్దార్ల సర్దుబాటులో భాగంగా దక్షిణ మండలానికి తహసీల్దార్‌ను నియమించారు. భవనం, సిబ్బంది, కార్యాలయం లేకుండా నూతనంగా వచ్చే తహసీల్దార్ ఎక్కడ నుంచి పరిపాలన కొనసాగించాలనే అంశంపై స్పష్టతలేని స్థితి నెలకొంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలాన్ని ఉత్తరం, దక్షిణ మండలాల తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించారు. 2023 ఫిబ్రవరి 28వ తేదీన ప్రభుత్వ జీవోఆర్‌టీ నెంబరు 213 కూడా జారీ చేసింది. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లు, మండలంలోని 34 పంచాయతీలు ఇప్పటివరకు ఒకే తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం మచిలీపట్నంను దక్షిణ, ఉత్తరం మండలాలుగా విడగొట్టి రెండు తహసీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దక్షిణ మండలం పరిధిలోకి ఎస్ఎన్ గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు, పల్లెతుమ్మలపాలెం పంచాయతీలను చేర్చారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ నుంచి 39వ డివిజన్ వరకు చేర్చారు. దక్షిణ కార్యాలయాన్ని తొలుత నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు కిళ్లీ, సోడా అండ్ బీడీ వర్తకసంఘం భవనంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ భవనంలోని కొన్ని గదులను కూడా కేటాయించారు. ఇక్కడ పరిస్థితులు అనువుగా లేకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు. ఆ తరువాత చింతగుంటపాలెంలోని మీసేవా కేంద్రంలో దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నించి ఆ ప్రయత్నం కూడా విరమించారు. దీంతో ఈ మండలం పరిధిలోని పరిపాలనాపరమైన కార్యకలపాలన్నీ పాత కార్యాలయం నుంచే నడుపుతున్నారు.

అద్దె భవనం తీసుకుంటారా?

దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయం ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారనే అంశంపై ఇంకా స్పష్టతలేదు. నూతన కార్యాలయంలో సూపరిండెంట్, పీడీఎస్‌డీటీ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, అటెండర్‌లు, ఇతరత్రా సిబ్బందిని ఇంతవరకు కేటాయించలేదు. గతంలో ఒకేఒక్క సర్వేయరును నియమించినట్టుగా చూపారు. దక్షిణ మండలం పరిధిలో డివిజన్‌లు, గ్రామాల్లో పనిచేసే వీఆర్వోలు 30 మందికిపైగా ఉన్నారు. వీరికి సహాయకులుగా మరో 30 మంది వీఆర్ఏలు ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు మండలాలు, ఇద్దరు తహసీల్దార్లు ఉన్నట్లుగా చూపారు. ఇతర జిల్లాల నుంచి ఇద్దరు తహసీల్దార్లను పంపి ప్రస్తుతం జరిగిన బదిలీల్లో వారిని రిలీవ్ కూడా చేశారు. దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయానికి అన్ని వసతులూ సమకూర్చి కూటమి ప్రభుత్వంలోనైనా ప్రారంభించాలి.

గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం పేదలకు శాపంగా మారింది. లే అవుట్‌లోని ఇళ్లకు వెళ్లకుండా ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా గోడ కట్టడంతో పేదలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో దూరాన ఉన్న పొలాల్లో నుంచి కాలనీలోని తమ ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ

నడిరోడ్డుపై అడ్డుగోడ

- కాలనీలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గోడ
- పంచాయతీకి దాన పత్రంగా ఇచ్చిన రోడ్డుపై నిర్మాణం
- ఓ వ్యక్తి నిర్వాకంతో దారి కోల్పోయిన పేదలు
- గోడ బద్దలు కొడితేనే పేదలు వెళ్లగలిగేది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడకు చెందిన పేదలకు ముస్తాబాదలోని 200 ఎకరాల లే అవుట్‌లో 500 మంది పేదలకు ఇళ్ల పట్టాలు గత ప్రభుత్వం కేటాయించింది. విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందినవారు. ఈ కాలనీలో 150 ఇళ్లు పూర్తి అయ్యాయి. కొన్ని కుటుంబాలు నివశిస్తున్నాయి. మరో 350కిపైగా ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణ పనులు చేసుకోవటానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఈ కాలనీలోకి వెళ్లడానికి ముందు ఓ ప్రైవేటు వ్యక్తి కొంత భూమి ఉంది. అందులో కొంత డెవలప్‌మెంట్‌కు ఇచ్చి వెంచర్ వేశారు. మిగిలిన భూమి పొలంగా ఉంచుకున్నాడు. పొలం, వెంచర్ మధ్య 30 అడుగుల రోడ్డును వదిలారు. కాలనీకి వెళ్లాంటే ఇదే ప్రధాన దారి. ఈ దారి మీదుగానే లే అవుట్‌లోకి వెళ్లి పేదలు తమ ఇళ్ల నిర్మాణ పనులు చూసుకుంటారు. మెటీరియల్ వంటివి తరలించే వాహనాలు కూడా ఇటు నుంచే వెళ్లేవి. ఈ క్రమంలో తమ రోడ్డును ఉపయోగించుకుంటున్నందున తనకు పరిహారం ఇవ్వాల్సిందిగా అప్పట్లో సదరు యజమాని డిమాండ్ చేయటంతో మౌఖికంగా అప్పటి కార్పొరేషన్ అధికారులు అంగీకరించినట్టు తెలుస్తోంది. గతంలో ఒకసారి తనకు పరిహారం ఇవ్వలేదన్న కారణంతో ఈ మార్గంలో కంచె వేశాడు. లబ్ధిదారులు గొడవ చేయటంతో కార్పొరేషన్ అధికారులు జోక్యం చేసుకుని తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. మళ్లీ ఇప్పుడు ఆ యజమాని ఏకంగా పేదల కాలనీకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించాడు. పంచాయతీకి ఈ రోడ్డును దానపత్రంగా ఇచ్చినట్టుగా తెలిసింది. ఇచ్చాక అడ్డుకునే హక్కు ఆ వ్యక్తికి లేదు. కానీ గోడ కట్టేశాడు. ఈ గోడ వల్ల పేదల కాలనీలోని ప్రజలు బయటకు రావటానికి, బయట నుంచి కాలనీలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. పురుషోత్తపట్నంలోని పొలాల నుంచి వెళుతున్నారు. తక్షణం ఈ వ్యవహారంపై గన్నవరం రెవెన్యూ, పంచాయతీ, గృహ నిర్మాణ శాఖ అధికారులు దృష్టి సారించి గోడను తొలగించాలి.

23 మంది ఎస్ఐల బదిలీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 : జిల్లాలో 23 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలపూడి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కె.ఎస్.వి.సత్యనారాయణను గూడూరుకు బదిలీ చేశారు. గూడూరులో పనిచేస్తున్న ఐ.వీర్రాజును వీఆర్‌లో ఉంచారు. ఆత్కూరు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎ.పైడిబాబుకు కృత్తివెన్నుకు పంపి, కృత్తివెన్నులో పనిచేస్తున్న నాగరాజును వీఆర్‌లో ఉంచారు. ఉయ్యూరు టౌన్‌స్టేషన్‌లో పనిచేస్తున్న గణేష్‌కుమార్‌ను బంటుమిల్లికి, బంటుమిల్లిలో పనిచేస్తున్న వాసును వీఆర్‌కు, కృష్ణా ఉమెన్ పోలీసు స్టేషన్‌లో చేస్తున్న కె.శ్రీనివాసరావును అవనిగడ్డ ఎస్ఐ 1గా, అవనిగడ్డ ఎస్ఐ 1గా పనిచేస్తున్న జి.రమేష్‌బాబును వీఆర్‌కు పంపారు. ఉయ్యూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో చేస్తున్న ఉషారాణిని పెనమలూరుకు, నందివాడలో పనిచేస్తున్న నంబూరి చంటిబాబును గుడివాడ రూరల్‌కు, గుడివాడ రూరల్‌లో చేస్తున్న ఎన్.ఎల్.ఎన్.మూర్తిని వీఆర్‌కు పంపారు. పమిడిముక్కలలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను నందివాడకు, వీఆర్‌లో ఉన్న జి.వి.ప్రసాదరావును గుడివాడ ట్రాఫిక్, మచిలీపట్నం పీసీఆర్‌లో చేస్తున్న ఎం.అర్జునరాజును తోట్లవల్లూరు, తోట్లవల్లూరులో పనిచేస్తున్న పి.విశ్వనాథ్‌ను వీఆర్‌కు పంపారు. నాగాయలంకలో చేస్తున్న సుబ్రహ్మణ్యంను కూచిపూడికి, కూచిపూడిలో చేస్తున్న శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపారు. పామర్రులో పనిచేస్తున్న పి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పెదపారుపూడికి, ఉయ్యూరు రూరల్‌లో చేస్తున్న సిహెచ్.అవినాష్‌ను పామర్రుకు, పెదపారుపూడిలో పనిచేస్తున్న జి.రాజును పెనమలూరు ఎస్ఐ 1గా చేస్తున్న వి.యేసోబును, పెనమలూరు ఎస్ఐ2గా చేస్తున్న శేషుకుమార్, చల్లపల్లిలో చేస్తున్న సిహెచ్.చినబాబును వీఆర్‌కు పంపారు.

గన్నవరం మండలం రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. విమానాశ్రయ విస్తరణలో భూ సమీకరణలో ప్రభుత్వానికి నష్టం జరిగేలా చేస్తున్నారు. భూమి కోల్పోయిన వారికి ప్లాటు టు ప్లాటు ఇవ్వాల్సి ఉండగా ఎక్కువ పరిహారం రాబట్టే పద్ధతిలో తాజాగా రెవెన్యూ అధికారులు సీఆర్‌డీఏకు ప్రతిపాదనలు తీసుకువచ్చారు. వీటిని గతంలో ఒకసారి సీఆర్‌డీఏ అధికారులు తిరస్కరించినా మళ్లీ అవే ప్రతిపాదనలు తీసుకురావడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారం మాటున భారీ ముడుపుల పర్వం నడిచిందని ఆరోపణలు వస్తున్నాయి.



మళ్లీ అవే ప్రతిపాదనలు

రియల్టర్లకు ప్రయోజనం చేకూరేలా గన్నవరం రెవెన్యూ అధికారుల తీరు

- విమానాశ్రయ విస్తరణలో పూలింగ్ కింద భూములు ఇస్తామని సీఆర్‌డీఏకు ప్రతిపాదనలు
- ఒకసారి తిరస్కరించినా మరోమారు అవే ప్రతిపాదనలు
- విస్తరణలో వెంచర్లతో ప్లాట్లు కోల్పోయిన బాధితులు
- వీరికి ప్లాట్ టు ప్లాట్ ఇస్తామని నాటి టీడీపీ ప్రభుత్వం హామీ
- తాజా వ్యవహారంలో వైసీపీ నేత పాత్ర ఉన్నట్టు అనుమానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విమానాశ్రయ విస్తరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా 700 ఎకరాల భూములను సమీకరించారు. పలు వెంచర్లలోని ప్లాట్లను కూడా తీసుకోవాల్సి వచ్చింది. కేవలం వ్యవసాయ భూములకు సంబంధించి మాత్రమే సమీకరణ కింద తీసుకున్నారు. ఎంబజీ బ్రదర్స్, ఆదిత్య, విజయసాయి వెంచర్లలోని ప్లాట్లు కొన్నిటిని ప్లాటు టు ప్లాటు కింద తీసుకున్నారు. అప్పటి ప్రభుత్వం కూడా ఇదే హామీ ఇచ్చింది. ఆ దిశగా కదిలే సమయంలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. ఈ సమస్యను వైసీపీ పాలనలో పట్టించుకోకుండా వదిలేసింది.

వైసీపీ ప్రజాప్రతినిధికి అనుకూలంగా..

వెంచర్లలో ప్లాట్లు పోను ఓ 50 ఎకరాలు వైసీపీ ప్రజాప్రతినిధి ఒకరు గత ప్రభుత్వంలో కొనుగోలు చేశారు. ఆ తర్వాత భారీ రేటుకు వాటిని అమ్ముకున్నారు. వైసీపీ నేత విక్రయించిన భూముల పక్కనే ఉన్న ప్లాట్లు విమానాశ్రయ విస్తరణ పరిధిలోకి వచ్చాయి. వీటికి ప్లాట్ టు ప్లాట్ ఇవ్వాల్సి ఉండగా.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

అనుమానాస్పదంగా రెవెన్యూ అధికారుల తీరు

తాజా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. విమానాశ్రయ విస్తరణ సమస్యలపై దృష్టి పెట్టింది. రైతుల కౌలు సమస్యలతో పాటు, రిజిస్ట్రేషన్లు, నిర్వాసితుల సమస్యలు, ప్లాట్ల లబ్ధిదారుల సమస్యలపై కేంద్రీకరించింది. ప్లాట్ల లబ్ధిదారులకు గతంలో నిర్దేశించిన విధంగా ప్లాట్ టు ప్లాట్ ఇవ్వటానికి సిద్ధపడింది. దీనికి విరుద్ధంగా గన్నవరం రెవెన్యూ అధికారులు భూ సమీకరణ పథకం కింద ఇస్తామని తెలివిగా సీఆర్‌డీఏకు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన వెనుక కొందరు రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్టు తెలుస్తోంది.

టీడీపీ ప్రభుత్వం అప్పట్లో చేసిందిదే..

బుద్ధవరంలో దాదాపుగా 423 మంది వరకు విమానాశ్రయ విస్తరణ కారణంగా నిర్వాసితులయ్యారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వం ప్లాట్ టు ప్లాట్ ప్రాతిపదికన పునరావాసం కల్పించేందుకు చిన్నఅవుటపల్లిలో 48 ఎకరాలు సేకరించింది. అక్కడ లే అవుట్ వేసి ప్లాట్లుగా విభజించింది. రోడ్లు, డ్రెయిన్లు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించింది. లబ్ధిదారులకు మోడల్ గృహాలను కట్టించేందుకు అప్పట్లో ఓ ఏజన్సీతో డిజైన్లు రూపొందించింది. ఇంతలో ప్రభుత్వం మారింది.

సమీకరణకు, ప్లాట్ టు ప్లాట్‌కు తేడా ఏంటి?

వెంచర్లలోని ప్లాట్ల వారికి అమరావతిలో ప్యాకేజీ కల్పిస్తే.. పేదలకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. పేదలకు ఇవ్వకుండా ప్లాట్లదారులకే ప్యాకేజీ కల్పిస్తే పేదల పట్ల ఒక న్యాయం, పెద్దల పట్ల ఒక న్యాయం చూపినట్టు అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్లాట్ టు ప్లాట్ విధానాన్ని అవలంబించింది. ఇప్పుడు రాజధానిలో ధరలు పెరిగాయన్న ఉద్దేశంతో సమీకరణ కింద ఇచ్చేస్తే ప్యాకేజీకి భారీ విలువ ఉంటుందని కొందరు రెవెన్యూ అధికారులతో వెంచర్ల వ్యాపారులు చేతులు కలిపినట్టుగా తెలుస్తోంది. దీంతో వెంచర్ల పరిధిలోని 20 ఎకరాలను పూలింగ్ కింద ఇచ్చేందుకు సీఆర్‌డీఏకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు తీసుకొచ్చారు.



పెడనలో ఫ్లెక్సీ రగడ!

6లో..

- టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ
- ఉద్రిక్తత.. అడ్డుకున్న పోలీసులు

కొండపై ఆషాఢ రద్దీ

- దుర్గమ్మను దర్శించుకున్న 50 వేల మంది
- 31వేల చీరల సారె సమర్పణ



కొండపై ఆషాఢం రద్దీ

- దుర్గమ్మను దర్శించుకున్న 50 వేల మంది .. ముగిసిన ఆషాఢం
- 31వేల చీరల సారె సమర్పణ



వన్‌టౌన్, ఆగస్టు 4 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాలు, సారె సమర్పణల కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయని దేవస్థానం ఈవో రామారావు తెలిపారు. ఆదివారం దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది తరపున సారె సమర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆషాఢమాసంలో పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి 31 వేలకు పైగా చీరలను సమర్పించారన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా లోక కళ్యాణార్థం వారాహి నవరాత్రి పూజ, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ఈతి బాధలు తొలగించాలని మూడు రోజుల పాటు శాకంబరీ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించినట్టు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేయటంలో అందరి సహకారం ఉందన్నారు. ఆషాఢమాసం చివరి రోజైన ఆదివారం దుర్గగుడి కొండపై భక్తుల రద్దీ పెరిగింది. భక్తులకు శీఘ్ర దర్శనం కోసం క్యూలలో భక్తులను ఈవో, అధికారులు నియంత్రించారు.

నేటి నుంచి శ్రావణమాసం

శ్రావణ మాసం పురస్కరించుకుని దేవస్థానంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

దేవస్థాన సిబ్బంది సారె



ఆషాఢ మాసం ముగింపు నాడు ఆదివారం దేవస్థానం సిబ్బంది తరపున అమ్మవారికి ఘనంగా సారె సమర్పించారు. బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో ఉన్న రావిచెట్టు వద్ద విగ్రహాలకు ఈవో రామారావు, ఆలయ అధికారులు, సిబ్బంది వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా సారెతో కొండపైకి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లీలా కుమార్, స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాదశర్మ, వైదిక సిబ్బంది, వేద పండితులు, అర్చకులు, ఈఈలో ఇంజనీరింగ్ సిబ్బంది, వివిధ విభాగాల పర్యవేక్షకులు తదితరులు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

సూర్యోపాసన సేవ

ఆదివారం పురస్కరించుకుని సకలజనులకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుతూ దుర్గగుడి అర్చకులు సూర్యోపాసన సేవచేశారు. సూర్యనారాయణస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అరుణ పారాయణ చేశారు.

అన్న వితరణకు విరాళం

చీరాల, ముస్తఫానగర్‌కు చెందిన మద్దుల నాగేశ్వరరావు కుటుంబసభ్యులు ఈవో రామారావు ద్వారా రూ.1,00,000 చెక్కు అందించారు. రాంకౌశిక్, యశశ్విని పేరిట అన్న వితరణకు విరాళం అందజేశారు.



ధర్మ పథంపై అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి ధర్మపథం వేదికపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. విజయవాడకు చెందిన భాగవతుల వెంకటరామశర్మ బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యంతో అభినయించి ఆహూతుల హర్షధ్వానాలు అందుకుంది.



ఐఎంఏ హాలు నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మీషా

తల్లిపాలే శిశువుకు తొలి ఆరోగ్య టీకా

- ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో

గవర్నర్‌పేట, ఆగస్టు 4 : తల్లిపాలు శిశువుకు తొలి ఆరోగ్య టీకా వలే పనిచేస్తుందని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ జి. లక్ష్మీషా అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత పిల్లల వైద్య నిపుణుల మండలి, కృష్ణాజిల్లా వైద్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రి వరకు ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల అవగాహన నడకను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'అంతరాన్ని తగ్గిద్దాం, తల్లులందరూ తల్లిపాలు ఇచ్చేలా మద్దతిద్దాం' అనే నినాదంతో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా బ్రెస్ట్ కేన్సర్ రుగ్మత నివారణ చికిత్సకు సాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పిల్లల వైద్యనిపుణుల మండలి కృష్ణాజిల్లా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ యలమంచిలి సంధ్యా, కార్యదర్శి డాక్టర్ వి.శ్రీదేవి, ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ చలసాని ప్రమోద్, వైద్యులు వెల్లంకి శ్రీదేవి, డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ పీవీ దుర్గరాణి, డాక్టర్ చందన, వివిధ వైద్యకళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ఇసుక కట్టలతో పూడ్చిన గండి

బందరు కాలువ గండి పూడ్చివేత

తోట్లవల్లూరు, ఆగస్టు 4 : పెనమకూరు వద్ద బందరు కాలువకు పడిన గండిని ఆదివారం ఇసుక కట్టలు అడ్డుపెట్టి పూడ్చివేశారు. గత రెండు రోజులుగా కాలువ ప్రవాహాన్ని తగ్గించక పోవటంతో పంచాయతీ, గ్రామస్థులు పడిన శ్రమ ఫలితం ఇవ్వలేదు. 'కాల్వకట్టకు గండి' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ ప్రవాహాన్ని కొంత తగ్గించారు. దాంతో ఇసుక కట్టలు వేయటానికి అనుకూలత ఏర్పడింది. ప్రస్తుతానికి గండిని ఇసుకకట్టలతో పూడ్చామని, అక్కడ మట్టిని కూడా వేయాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. మట్టి వేయకుంటే మళ్లీ నీటి ప్రవాహం పెరిగితే గండి సమస్య ఉత్పన్నం అవుతుందని పేర్కొన్నారు.

రక్షణ ఎగుమతుల్లో ముందున్నాం

- శాస్త్రవేత్త జి.సతీష్ రెడ్డి
- ఘనంగా మండలి జయంతి వేడుకలు



సతీష్ రెడ్డికి పురస్కారం అందజేస్తున్న జస్టిస్ దుర్గా ప్రసాద్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అవనిగడ్డ, ఆగస్టు 4 : రక్షణ రంగ ఎగుమతుల్లో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించటమే కాక, నేడు ఇతర దేశాలకు రక్షణ సామగ్రిని ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని, దీనికి రక్షణ రంగ శాస్త్రవేత్తలు నిర్విరామ కృషే కారణమని శాస్త్రవేత్త జి.సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ రంగంలో విశేష పరిశోధనలు చేసిన తెలుగు తేజం సతీష్ రెడ్డికి మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని జస్టిస్ యు.దుర్గాప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ భవాని ప్రసాద్, జస్టిస్ ఆకుల వెంకట సాయిల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ, గడచిన రెండు దశాబ్దాల కాలంలో రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించేందుకు విశేష కృషి చేసిందని, నేడు 25 వేల కోట్ల రూపాయల మేర ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగిందని, రాబోయే 1, 2 ఏళ్లలో ఈ ఎగుమతులు రూ.80 వేలకోట్లకు చేరుకుంటాయని సతీష్ రెడ్డి అన్నారు. నిమ్మకూరులోని బెల్ కంపెనీ ద్వారా త్వరలోనే ప్రపంచానికి ఎగుమతులు ఉంటాయని, గుల్లలమోదలో క్షిపణి పరిశోధనా కేంద్రానికి సంబంధించి మౌలిక సదుపాయల కల్పన పూర్తయిందని, త్వరలోనే క్షిపణి పరిశోధన కల సాకారం అవుతుందని ఆయన తెలిపారు.

ఎంవీకే సేవలు మరువలేనివి..

దివిసీమ గాంధీగా పేరుగాంచిన మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాషాభివృద్ధికి, దివిసీమ పునర్నిర్మాణం కోసం చేసిన సేవలు నిరూపమానమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, ఆకుల శేషసాయిలు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఏకతాటిపైకి తెచ్చి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన ఘనత ఎంవీకేదే అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ఎంవీకే జీవిత చరిత్ర నేటి తరం యువతకు ఆదర్శనీయమన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సిలికానాంధ్ర వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్, డోలేంద్ర ప్రసాద్, కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, మండలి వెంకట్రామ్, మండలి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సంక్షేమ పథకాలు

- 49 యూనిట్లకు అవకాశం
- ఏడీ లక్ష్మీనారాయణ

గుడ్లవల్లేరు, ఆగస్టు 4 : పాడి పరిశ్రమ అభివృద్ధి దిశగా ప్రభుత్వం పాడి రైతులకు సంక్షేమ పథకాలను అందిస్తోందని గుడ్లవల్లేరు పశు సంవర్ధక శాఖ డివిజన్ ఏడీ ఎ.లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా గోరక్ష పశువుల శాలల నిర్మాణాలకు 90 శాతం రాయితీతో గుడివాడ, గుడ్లవల్లేరు మండలాలకుగాను 49 యూనిట్ల చొప్పున అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. రెండు గేదెలకు షెడ్ నిర్మాణానికి రూ1.15 లక్షలు కాగా రైతువాటా రూ11.500, ప్రభుత్వం రూ 1.03,500 ఇస్తుందని, 6 గేదెల వరకూ అవకాశం ఉందని తెలిపారు. గొర్రెల షెడ్‌లకు 70 శాతం రాయితీతో 20కి రూ.1.30 లక్షలు.. రైతు వాటా 39 వేలు, ప్రభుత్వం రూ. 91 వేలు, ఇలా 100 గొర్రెల వరకూ ఇస్తామన్నారు. కోళ్లకు 70 శాతం రాయితీ తో 100 కోళ్లకు రూ.87,000లకు రైతు వాటా రూ26,100, ప్రభుత్వం రూ. 60.900 ఇస్తుందన్నారు. 200 కోళ్ల షెడ్ నిర్మాణానికి 70 శాతం రాయితీ ఇస్తుందన్నారు. వీటికి అర్హులు తెల్లరేషన్ కార్డు దారులై ఉండాలి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. పాడి రైతులు తమ గ్రామాలలో పశు వైద్యశాలల్లో అర్జీలు పొంది పెట్టుకోవాలని, సందేహాలు ఉంటే గుడ్లవల్లేరు పశు వైద్యశాలలో ఏడీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.



వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాకవి దేవేంద్ర, వామపక్ష నేతలు

పాటను ఉద్యమ ఆయుధంగా మలచిన వడ్లమూడి

- ప్రజాకవి వడ్లమూడి శతజయంతిలో వక్తలు

గవర్నర్‌పేట, ఆగస్టు 4 : కళారంగానికి తొలి ఆయుధం పాట అని, అటువంటి పాటను నాటి ఉద్యమ అవసరాలకు ఆయుధంగా మలచి, నమ్మిన సిద్ధాంతాలకు జీవితాన్ని అంకితం చేసిన మహా వ్యక్తి, ప్రజాకవి వడ్లమూడి అని ప్రజాకవి కె.దేవేంద్ర అన్నారు. ప్రజాకవి, రచయిత, ప్రజానాట్యమండలి పునర్నిర్మాణంలో ఒకరైన వడ్లమూడి నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవం ఆదివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకె)లో జరిగింది. దీనిలో భాగంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ, వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆట..పాట..మాట' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ సభకు అధ్యక్షత వహించారు. కె.దేవేంద్ర, పలువురు వామపక్ష, ప్రజాసంఘాల నేతలు వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ, కళ కళ కోసం కాదు ప్రజల కోసమే అని విశ్వసించిన వ్యక్తి వడ్లమూడి అన్నారు. వడ్లమూడి వేలుపట్టుకుని తన పాట ప్రయాణం మొదలైందని ప్రకటించారు. ఈ సందర్భంగా వడ్లమూడి నాగేశ్వరరావు రచించిన గేయాల ఆలాపన, మారాజులొచ్చారు, సందేశం, పల్లెలో పనివాడా నృత్యరూపకాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నేత వై.కేశవరావు, సీనియర్ జర్నలిస్టు వడ్లమూడి పద్మ, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ వడ్లమూడి రామకృష్ణ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పెడనలో ఫ్లెక్సీ రగడ!

- టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ
- ఉద్రిక్తత.. అడ్డుకున్న పోలీసులు



ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో మోహరించిన పోలీసులు

పెడన, ఆగస్టు 4 : టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఏర్పడిన ఫ్లెక్సీల వివాదంతో పెడన బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పి ఉద్రిక్తతను సడలింప చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో టీడీపీకి చెందిన ఫ్లెక్సీ ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలకు ఫ్లెక్సీ చిరిగిపోయింది. నాలుగు రోజుల క్రితం చిరిగిపోయిన ఫ్లెక్సీని తొలగించిన వైసీపీ వర్గీయులు దాని స్థానంలో వైసీపీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం నడుస్తోంది. కాగా ఆదివారం టీడీపీ నాయకులు వహబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, హమీదుల్లా, పరసా జితేంద్ర, సేనాపతి అజయ్ తదితరులు వైసీపీ ఫ్లెక్సీని తొలగించి దాని స్థానంలో ఏర్పాటు చేయడానికి టీడీపీ ఫ్లెక్సీని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న సీఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో వచ్చి వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తామని, తొలగించిన తరువాత మీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ నాయకులకు సూచించారు. అందుకు వారు అంగీకరించారు. కాగా కమిషనర్ వెంకట్రామయ్య ఆదేశాల మేరకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్‌లు సిబ్బందితో వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తుండగా వైసీపీకి చెందిన వైస్‌చైర్మన్ ఎండి ఖాజా అడ్డుతగిలి ఫ్లెక్సీని తొలగిస్తే చేతులు నరికేస్తానని సిబ్బందిని హెచ్చరించారు. పోలీసులతో వాదనకు దిగాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు ఖాజాను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఖాజాకు మద్దతుగా వైసీపీ నాయకులు కోమట్ల అనిల్, రౌతుల ప్రసాద్‌లు స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ సుభాన్ వైసీపీ నాయకులకు నచ్చచెప్పి ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరింపచేశారు. మునిసిపల్ సిబ్బంది పోలీసు బందోబస్తుతో వైసీపీ ఫ్లెక్సీని తొలగించారు. అనంతరం టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేయబోగా రెండు రోజుల తరువాత ఏర్పాటు చేసుకోవాలని సీఐ వారికి సూచించారు.



వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది



టీడీపీ సోషల్ మీడియా సభ్యులు

టీడీపీ సోషల్ మీడియా ఆత్మీయ కలయిక



కేకు కట్ చేస్తున్న టీడీపీ నేతలు

వన్‌టౌన్ ఆగస్టు 4 : విజయవాడ ఎన్టీఆర్ కాలనీలోని ఓ కళ్యాణ మండపంలో టీడీపీ సోషల్ మీడియా మిత్రుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు దూండీ రాకేష్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సోషల్ మీడియా కుటుంబసభ్యులపై నమోదైన కేసుల వివరాలను తెలియపరచాలన్నారు. టీడీపీ సోషల్ మీడియా కీలక పాత్ర పోషించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపనులు, పథకాల అమలును ప్రజలకు వివరించాలని తెలిపారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. టీడీపీ గెలుపులో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమ నిర్వహకులు రావెళ్ల ఉదయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పసాని రాజేష్, అడుసుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన వైద్యంతో సత్వర ప్రయోజనం

- క్యాపిటల్ ఆసుపత్రిలో లైవ్ అడ్వాన్స్‌డ్ గైనకాలజీ వర్క్‌షాప్

పెనమలూరు, ఆగస్టు 4 : పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో ఆదివారం గైనకాలజీపై మినిమల్లీ ఇన్వేసివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అసోసియేషన్, ఐఎంఏ, క్యాపిటల్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో రెండువందలకు పైగా వైద్యులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో ఎండోమెట్రియాసిస్‌కు సంబంధించిన లాపరోస్కోపిక్ సర్జరీ టెక్నిక్‌ను ప్రత్యక్ష ప్రసారం చేశారు. వర్క్‌షాప్ ఆపరేటింగ్ ఫ్యాకల్టీ, క్యాపిటల్ ఆసుపత్రి, హెల్త్‌కేర్ ఇండస్ట్రీకి గొప్ప ప్రారంభంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ హరీష్ మన్నే పేర్కొన్నారు. రోగులకు ప్రయోజనం చేకూర్చే మినిమల్లీ ఇన్వేషన్ కలిగి ఉన్న అధునాతన లాపరోస్కోపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే తీవ్ర పీరియడ్స్ నొప్పి ఎండోమెట్రియోసిస్ అనేక ఇతర ఇబ్బందులను కలిగిస్తుందని, దీనికి క్యాపిటల్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందని డాక్టర్ నెలవల్లి అశ్విని తెలిపారు. ఏపీఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, ఇటువంటి లైవ్ వర్క్‌షాపులతో ఆరోగ్య సంరక్షణ నిపుణులు మెరుగైన క్లినికల్ ప్రమాణాలను నేర్చుకొంటారని తెలిపారు.



క్యాపిటల్ ఆసుపత్రిలో లైవ్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఎండీ



ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

బందరు పోర్టు పనులు వేగవంతం

- గన్నవరం ఘటనలో ఎవరినీ వదిలిపెట్టం
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 : బందరు పోర్టు నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని, దీంతో బందరులో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, శని, ఆదివారాల్లో ఏదో ఒక రోజు ప్రజా దర్బార్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు 1159 అర్జీలు అందగా, వాటిలో 850 పరిష్కరించినట్టు తెలిపారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేయాలంటూ వినతిపత్రాలు అందుతున్నాయన్నారు. ఉద్యోగాల కోసం 159 మంది యువత దరఖాస్తు చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈనెల 25న కొరియన్ బృందం మచిలీపట్నం బీచ్‌ను సందర్శించనుందన్నారు. త్వరలో మేధావులతో సమావేశం ఏర్పాటుచేసి బందరు భవిష్యత్తుపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, ఆగస్టు 4 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే సేవా భారతి, తెలుగు తేజం జాతీయ స్థాయి పురస్కారాలు-2024 ప్రదానోత్సవానికి అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు 'ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ' (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు వికలాంగులకు సేవలు అందించే సంస్థలు, కళలు, సాహిత్యం, క్రీడలు, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో సేవలు అందించేవారు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో ప్రతిభగల వారు పురస్కారాల ఎంపికకు అర్హులన్నారు. తమ అర్హతను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు దరఖాస్తుకు జతచేసి ఈనెల 10వ తేదీ లోగా సంస్థ కార్యాలయానికి చేరేలా పంపాలని కోరారు. ఇతర వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

సోషల్ జస్టిస్ ఫోరం ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

ధర్నాచౌక్, ఆగస్టు 4 : సోషల్ జస్టిస్ ఫోరం తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ప్రకటించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ సామాజిక ఉద్యమ నేత యర్రాకుల తులసీరామ్ యాదవ్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థిగా కాపు సామాజిక ఉద్యమ నేత కోటిపల్లి అయ్యప్పను ప్రకటించడం జరిగిందని, వీరి గెలుపుకు ఫోరం కృషి చేస్తుందని అన్నారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కో-కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, నల్లజర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

2,500 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో పోలీసుల తనిఖీల్లో 2,500 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌తో వెళుతున్న లారీ పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బసవ కల్యాణ్ తాలూకా చిల్లపల్లి గ్రామానికి చెందిన చిట్‌గుప్ప రాజాసాహెబ్ (61) లారీ డ్రైవర్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి లారీ ఆపి పరారవుతుండగా పట్టుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి నుంచి మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి బియ్యాన్ని తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. 50 కిలోల 500 బస్తాలు 2,500 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు పీడీఎస్ డీటీ రామకృష్ణ చెప్పారు. శనిశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి నుంచి బియ్యాన్ని లోడ్ చేసుకొని వెళుతున్నట్టు తేలిందని పోలీసులు వివరించారు.

కట్న వేధింపులతో..

- వివాహిత ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

చిట్టినగర్, ఆగస్టు 4 : భర్త, అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత అధిక మోతాదులో మాత్రలు మింగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాపురానికి చెందిన రామలక్ష్మి (38) బుడమేరు మధ్య కట్టకి చెందిన కె.మణికంఠలు 2023 జూన్‌లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మొదట సక్రమంగానే చూసుకున్న భర్త కొద్ది నెలలుగా షాపు పెట్టుకోవాలని, పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మని రామలక్ష్మిని వేధింపులకు గురి చేస్తున్నాడు. మణికంఠ తల్లి, అక్క, ఆమె భర్త పలుమార్లు రామలక్ష్మిని కట్నం తీసుకురాకుండా వచ్చావంటూ వేధింపులకు గురి చేసేవాళ్లు. విషయం రామలక్ష్మి తన తండ్రి దుర్గాప్రసాద్‌కు చెప్పటంతో ఇటీవల అంబాపురంలోనే కొత్తగా కాపురం పెట్టించారు. అయినా మణికంఠలో ఎటువంటి మార్పులేదు. రెండు రోజుల క్రితం షాపు పెట్టడానికి డబ్బులు తెమ్మని రామలక్ష్మిని కొట్టడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న మాత్రలు అధిక మొత్తంలో వేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో మణికంఠ రామలక్ష్మి తండ్రికి విషయం తెలియజేశాడు. హుటాహుటిన ఆమెను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ రామలక్ష్మి ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, ఆడపడుచు, ఆమె భర్తపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

రాష్ట్రానికి మరిన్ని సేవలందించాలి

ఎంపీ వల్లభనేని బాలశౌరిని కోరిన వెంకట్



గన్నవరం, ఆగస్టు 4 : శ్రీకృష్ణదేవరాయ సంఘం నేషనల్ కన్వీనర్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ సంకాబత్తుల వెంకట్ ఎంపీ వల్లభనేని బాలశౌరిని ఆదివారం నాడు మర్యాదపూర్వకంగా మచిలీపట్నంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, బాలశౌరి భవిష్యత్‌లో కేంద్రమంత్రి పదవి అలంకరించి రాష్ట్రానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 4 : వేలేరు అమ్మ నిలయం సమీపంలోని పామాయిల్ తోటలో ఆదివారం నిర్వహించిన పేకాట శిబిరంపై ఏఎస్సై కనకరాజు సిబ్బంది తో దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,890లు నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

స్థానిక తారక రామనగర్ కాలనీలో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్న గంటా విజయకల్యాణిపై దాడి చేసి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన అదే కాలనీకి చెందిన పులవర్తి వెంకటేశ్వరరావుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. శనివారం రాత్రి అకారణంగా బడ్డీకొట్టుపై దాడి చేసి అందులో ఉన్న సరుకులను ధ్వంసం చేసి మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా దేవినేని గంగాధర్ ప్రథమ వర్ధంతి



దేవినేని గంగాధర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, రాజా

కంకిపాడు, ఆగస్టు 4 : టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దేవినేని రాజా తండ్రి గంగాధర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం సీతారామ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి, హేమ, కుమారుడు బోడె వెంకట్రామ్, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, పడవల మధుసూదనరావు తదితరులు పాల్గొని గంగాధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 4: తీవ్ర అనారోగ్యానికి గురైన స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కలిశెట్టి మహాలక్ష్మికి శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ వైద్యపరీక్షలకు ఆదివారం ఆర్థికసాయం అంద జేశా రు. బాధితురాలికి కాళ్లు చేతులు పని చేయక ఇబ్బంది పడుతోంది. గ్రామటీడీపీ నాయకుడు యార్లగడ్డ సత్యనారాయణ అభ్యర్థన మేరకు బాధితురాలిని సత్యప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా బాధితురాలికి నెల రోజులు పాటు ఫిజియోథెరిపీ ఖర్చులు నిమిత్తం రూ.10వేలు అందచేసి మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో వడ్లమూడి ఆంజనేయులు, జాస్తి భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ..

కలపర్రుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కూతాడి మహాలక్ష్మికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ బస్‌పాస్ చార్జీలు నిమిత్తం రూ.6వేలు ఆర్థికసాయం అందిజేసింది. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయలో మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థినికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సందీప్

కంకిపాడు, ఆగస్టు 4 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్య లు తీసుకుంటామని కంకిపాడు ఎస్సై డి. సందీప్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారికి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై - 2 తాతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రొద్దుటూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యార్లగడ్డ నాగేశ్వర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆయన వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

డ్రెయిన్లలో పూడికతీత

ఈడుపుగల్లు (కంకిపాడు), ఆగస్టు 4 : దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో డ్రెయిన్ పూడికతీత పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ, గ్రామంలోని పలు ప్రధాన కాలువలు పూడికుపోయి మురుగు నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. దీంతో కాలువల పూడిక తీత పనులతో పాటు దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిలారు శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, అనుమోలు రామకృష్ణ, మైనేని దుర్గాభవాని, షేక్ నాగుర్‌బీ, బాజి బీ, బండారు ప్రవీణ్ పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పందిపాటి ఇందిర

కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, ఆగస్టు 4 : కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దని, ఎన్టీఆర్ వైద్యసేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈడ్పుగంటి వెంకటేశ్వరరావు, అట్లూరి వెంకటకృష్ణ రామబ్రహ్మంల జ్ఞాపకార్థం సమత శంకర నేత్ర చికిత్సాలయ (ఉయ్యూరు) వైద్యబృందం ఉంగుటూరులోని జయరామా విజ్ఞాన విహార్ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యార్లగడ్డ, మాజీఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావుతో కలిసి రిబ్బన్‌కట్ చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానమని పెద్దలన్నారని, కళ్లకు వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో సరైన చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా యార్లగడ్డ, బాలవర్ధనరావులు స్వయంగా కంటిచూపు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వేద గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.

శంకర నేత్ర చికిత్సాలయ ఎండీడాక్టర్ ఎస్.స్వాతి మాట్లాడుతూ, ఈ శిబిరంలో 168 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని, అందులో 33 మందికి కళ్లజోళ్లు, 45మందికి కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ డి.ఇవాన్, పి.కోటిరతన్, ఆర్.పవన్‌కుమార్, పి.మురళి, టీడీపీ గ్రామఅధ్యక్షుడు ఈడ్పుగంటి కృష్ణమూర్తి, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, నాయకులు గుత్తా అనిల్, పోతినేని రామకృష్ణ, తుమ్మల జగదీష్, పాఠశాల హెచ్‌ఎం సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉంగుటూరులో కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డతో కలిసి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి



కేసరపల్లిలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న పొట్లూరి బసవరావు

కేసరపల్లిలో..

గన్నవరం : సర్వేంద్రీయానం నయనం ప్రధానమని మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. మండలంలోని కేసరపల్లిలో పొట్లూరి బసవరావు ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ, మనిషికి కళ్లు ఎంతో ముఖ్యమని చెప్పారు. కంటి సమ స్యలను అశ్రద్ధ చేయవద్దని సూచించారు. కంటి వైద్యుల సూచనలను పాటించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. 112 మందికి కంటి పరీక్షలు చేశారు. తొలుత బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంటి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెన్నేరులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న అన్నే ధనయ్య

తెన్నేరులో..

కంకిపాడు : గ్రామీణ ప్రాంతాల్లో రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. తెన్నేరులో రోటరీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ధనయ్య మాట్లాడుతూ, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విశేషసేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కుటుంబరావు, జుజ్జువరపు నాని, సుమిత్ర, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, దేవినేని చంద్రం, బోసు, లంక నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరంకి టీడీపీ కార్యాలయంలో..

పెనమలూరు : పోరంకి టీడీపీ కార్యాలయం లో ఆదివారం అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు, వీఆర్కే నగర్ వాణిజ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. స్థానిక క్యాపిటల్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి సుమారు 250 మంది స్థానికులు హాజరై షుగరు, బీపీ పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులను పొందారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ అనుమోలు ప్రభాకరరావు, డీవీ సుబ్బారావు, కంచర్ల రాధా, బొంగరాల అబ్రహాం, కోలా ప్రసాద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిగడప డొంక రోడ్డులో..

తాడిగడప డొంకరోడ్డులో నేడు లంకా సురేష్ ఆర్థిక సాయంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు లంకా నారాయణరావు తెలిపారు. పార్థసారథి కళ్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో కామినేని ఆసుపత్రి వైద్యులు, శంకర నేత్రాలయ వైద్యులు పాల్గొని స్థానికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు.



పోరంకిలో మందులు పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు



ముదునూరులో చౌడేశ్వరీదేవి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు వెళ్తున్న టీడీపీ నాయకురాలు మాధవి

చౌడేశ్వరీదేవికి ఆషాఢ సారె

ముదూనూరు(ఉయ్యూరు), ఆగస్టు 4 : ముదునూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలోని చౌడేశ్వరీదేవి అమ్మవారికి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ పాలడుగు బాలాజీ, టీడీపీ నాయకురాలు మాధవి ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ మాస సారె సమర్పించారు. పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, పండ్లు, పూలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. పలువురు గ్రామస్థులు, కప్పలదొడ్డి వాస్తవ్యులు దేవాంగులు పాల్గొని అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

నైపుణ్యంతో యువత ఉన్నతస్థాయికి చేరాలి

మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్



వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఆర్ ఎగ్జిబిషన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు, ఆగస్టు 4 : యువత నైపుణ్యం, సొంత తెలివితేటలతో వ్యాపార, ఇతర రంగాల్లో రాణిస్తూ మరికొందరికి ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఏఆర్ ఎగ్జిబిషన్స్ ప్రతినిధులు ఆదివారం రాజేంద్రప్రసాద్‌ను కలసి సమస్యల మెమొరాండం అందజేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రాజేద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచంలో ఏదేశంలో లేనంతగా యువత మనదేశంలో ఉన్నారని, అందులోను తెలుగు రాష్ట్రాల్లో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారన్నారు. మరింత నైపుణ్యంతో ఉన్నతస్థాయికి చేరుకుని మరికొంత మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. జంపన శ్రీనివాస్, రాజులపాటి ఫణి, అజ్మతుల్లా, తిరుపతిరావు, రంగస్వామి ఆనంద్, సునీల్, బాబి తదితరులు రాజేంద్రప్రసాద్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉయ్యూరు జడ్పీ హైస్కూల్ 1991- 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఉయ్యూరు, ఆగస్టు 4 : ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పలు ప్రాంతాలు, వివిధ స్థాయిల్లో స్థిరపడిన 1991- 1992 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు కలసి తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని అప్పటి స్మృతులు గుర్తుతెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుని, సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌కె సలీమ్, ముప్పా శివరామకృష్ణ, రామకృష్ణ, అనీస్, రాజులపాటి వేణుగోపాల్, అంకినీడు ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సాటివారికి సాయం చేయటమే బైబిల్ సందేశం: ఎంపీ శివనాథ్



చర్చి ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్ ఆగస్టు 4: సాటివారికి సహాయం చేయటమే బైబిల్ సందేశమని, దేవదేవుడు ఆశీస్సులు వల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కంకిపాడు మండలం దావులూరులో పాదర్ చాట్ల రాజశేఖర్ నిర్మించిన ట్రాన్స్‌ఫర్మేషన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని ఫౌండేషన్ స్టోన్‌ను ఆవిష్కరించారు. రెవ. డాక్టర్ డేవిడ్ బ్రెనహామ్ దేవుని కీర్తన ఆలపిస్తుండగా మందిరంలో ప్రవేశించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రాజశేఖర్, బ్రెనహామ్ తనకు మంచి మిత్రులని, తనకోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనటం తన అదృష్టమన్నారు. పుట్టిన ఊరిలోనే దైవ మందిరాన్ని రాజశేఖర్ నిర్మించటం ఎంతో అభినందనీయమని, రాజశేఖర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాలకు ఎంతోకొంత సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లంకా కరుణాకర్ దాస్, రెవ. ఆశీర్వాదం పాల్, కారుమంచి ప్రశాంత్, తాన్యా, చాట్ల విజయ్‌బాబు, టీడీపీ నాయకుడు మాదిగాని గుర్నాధం, జడ్పీ కార్యదర్శి నరసింహ చౌదరి, డాక్టర్ సంకే విశ్వనాధం, హబీద్ హుస్సేన్, ఇత్తడి చార్లెస్, తదితరులతో పాటు గ్రామ ప్రజలు, దైవ సేవకులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పాయకాపురం, ఆగస్టు 4: బాలికను వేధిస్తున్న యువకుడిపై నున్న రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన బాలిక(11) స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన యువకుడు అశోక్ ఎవరి తోనే ఫోన్‌లో మాట్లాడుతున్నట్లుగా బాలిక పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నాడు. అదేమని ప్రశ్నించిన బాలిక తల్లిని కూడా దుర్భాషలాడాడు. దీంతో బాధితులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే యార్లగడ్డ

ఉంగుటూరు, ఆగస్టు 4 : మండలపరిధిలో ఏలూరుకాలువకు అనుసంధానంగా వున్న ఉంగుటూరు కాల్వలో చేపట్టిన పూడికతీతపనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి రైతులకు త్వరితగతిన సాగునీరందించాలని ఎమ్మెల్యే, యార్లగడ్డ వెంకట్రావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉంగుటూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజలనుంచి పలు వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెన్నూతల, వెల్దిపాడు, నాగవరప్పాడు, ఆముదాలపల్లి, లంకపల్లి, ఎలుకపాడు, ఉంగుటూరు గ్రామాల రైతులు యార్లగడ్డను కలిశారు. సాగునీరందక తాముపడుతున్న కష్టాలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. గతప్రభుత్వం ఉపకాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టుపరిధిలోని దిగువ పొలాలకు సాగునీరందక వరినాట్లు ఎండిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకుంటే మూడురోజుల క్రితం ఒక్క ప్రొక్లెయిన్‌ను ఏర్పాటుచేసి కాలువ పూడికతీత పనులు బూతిమిల్లిపాడునుంచి చేపట్టారన్నారు. సుమారు 14కిలోమీటర్లమేర పొడవు గల ఉంగుటూరు కాలువలో ప్రొక్లెయిన్‌తో ఇప్పటికీ రెండుకిలోమీటర్ల మేర మాత్రమే పనులు జరిగాయని, పేరుకుపోయిన గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా, చెదారంతోపాటు మేటవేసుకుపోయిన మట్టి, ఇసుకదిబ్బలను తొలగించాలంటే కనీసం రెండు జేసీబీలు, ఒక ప్రొక్లెయిన్ అవసరమని అన్నారు. ఇరిగేషన్ ఏఈ కోలా శ్రీనివాసరావుని అడిగితే ఐదు రోజుల్లో కాలువ పూడికతీత పనులు పూర్తిచేస్తామని చెబుతున్నారన్నారు. పూడికతీత పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల రైతులు దాసరి శ్రీకృష్ణ, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, అజ్మీర్ వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, పోతినేని రామకృష్ణ, కాటూరి వరప్రసాద్, తుమ్మల జగదీష్ పాల్గొన్నారు.

వయనాడ్ బాధిత కుటుంబాలను ఆదుకుందాం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 4 : ప్రకృతి విపత్తుతో నిరాశ్రయులైన వయనాడ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మనవంతు సహాయం అదించేందుకు ప్రజలు కలిసి రావాలని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ కోరారు. బండారుగూడెంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అడిగారు. కులమతాలకతీతంగా ప్రజల స్పందించిన తీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతమైన బండారుగూడెం ప్రజలు వయనాడ్ బాధితులకు తమకు వీలైనంత సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రవి పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ ఫ్రెండ్‌షిప్ డే



స్నేహితుల దినోత్సవంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉయ్యూరు, ఆగస్టు 4 : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం (ఫ్రెడ్‌షిప్‌డే) ఘనంగా నిర్వహించారు. స్నేహమే జీవితం, స్నేహమే శాశ్వతం అంటూ స్నేహంలో మాధుర్యం, గొప్పదనం తెలియజేస్తూ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. అసోసియేషన్ సభ్యుడు సగ్గున రామ సత్యకిషోర్ సమకూర్చిన ఫ్రెండ్ షిప్ బ్యాండులు ఒకరి చేతికి మరొకరు కట్టి రక్షా బంధన్ జేశారు. రక్త సంబంధం లేక పోయినా మనకోసం ఆలసించేది స్నేహ బంధమని, స్నేహితుల దినోత్సవ విశిష్టతను అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు వివరించి సభ్యులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాపిరాజు, సీతారామయ్య, మల్లేశ్వరరావు, భానుప్రకాశ్, సలీమ్, గఫార్, ఆంజనేయులు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

కిరణ్‌పాల్‌కు ఎంపీ బాలశౌరి పరామర్శ



మచిలీపట్నం టౌన్ : బెరాకా సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ మృతి తీరనిలోటని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. బెరాకా వ్యవస్థాపకుడు సత్యనారాయణ కుమారుడు బ్రదర్ కిరణ్‌పాల్‌ను, తల్లి భారతిని బాలశౌరి పరామర్శించారు. బాలశౌరి మాట్లాడుతూ, సత్యనారాయణ రాష్ట్రమంతటా పర్యటించి దైవసేవలు చేశారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకులు మాదివాడ రాము, కొట్టె వెంకట్రావు, వంపుగడల చౌదరి తదితరులు ఉన్నారు.



ప్రగతి విద్యాసంస్థలో మాట్లాడుతున్న రక్షణ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి

ఆత్మవిశ్వాసంతో కలలను సాకారం చేసుకోవాలి

● రక్షణ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి

పామర్రు : ఆత్మ విశ్వాసం యువత ముందుకు సాగుతూ కలలను సాకారం చేసుకోవాలని భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రగతి విద్యా సంస్థలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సందేశమిచ్చారు. కార్యసాధనలో ఎంత కష్టం వచ్చినా డీలా పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమన్నారు. భారత్‌దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగడం గర్వకారణమన్నారు. తహసీల్దార్ వై.మల్లేశ్వరరావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత సనకా పూర్ణచంద్రరావు, ఉమా నాగమల్లేశ్వరి దంపతులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ శుభాకర్, ఎస్సై పి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థినులను ఆదుకోవాలి

మచిలీపట్నం టౌన్ : మానవతా వాదులందరూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న హాస్టల్‌లోని పేద విద్యార్థినులకు సాయం అందించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. ఉచిత బాలిక హాస్టల్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులకు స్టార్ కళాశాల విద్యార్థులు భోజనం పెట్టారు. ఫ్రెండ్‌షిప్‌డే బ్యాండ్లు కట్టారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బండి రామకృష్ణ, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మరకాని సమతాకీర్తి, స్టార్ కళాశాల డైరెక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిక్కు శ్రావణి పుట్టిన రోజు సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు స్వీట్లు పంచారు. హాస్టల్ విద్యార్థుల నిత్యావసర వస్తువులకు సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ రూ. 5 వేలు అందజేశారు. సంస్థ కార్యదర్శి కానుకొలను ఫణికిరణ్, ఉపాధ్యక్షుడు కె. రాజేంద్రప్రసాద్, సిహెచ్. సాయికృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



చల్లపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని స్వచ్ఛ చల్లపల్లి రథ సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి సూచించారు. స్వచ్ఛ చల్లపల్లి 3194వ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున హైవేకు ఇరువైపులా మొక్కలు నాటారు. హైవేపైనా, వంతెనల వద్ద శుభ్రపరిచారు. మన కోసం మనం ట్రస్ట్‌కు ఎనిమిదేళ్లుగా ప్రతి నెలా విరాళం అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి ఈనెల విరాళం రూ.5 వేలు డీఆర్కేకు అందచేశారు. చల్లపల్లికి ఏ మాత్రం సంబంధం లేని శాస్త్రి గ్రామ దత్తపుత్రుడిగా మారి స్వచ్ఛ సేవలందిస్తూ తమవంతు ఆర్థిక సహకారం అందించటం పట్ల స్వచ్ఛ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో ప్రాతూరి శాస్త్రి అన్నదానం చేశారు. తల్లి పుష్పావతి జ్ఞాపకార్థం అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు.



విక్కుర్తి శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

అవనిగడ్డ : విక్కుర్తి శ్రీనివాస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అవనిగడ్డ క్రీడా మైదానానికి దాదాపు లక్ష రూపాయలు వెచ్చించి భారీ గేట్‌ను విక్కుర్తి శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, ఆయన సోదరులు రాంబాబులను ఆదివారం ఘనంగా సత్కరించారు. విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీను, పున్నయ్య చౌదరి, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, బస్వారావు, న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామోపాధ్యాయ సంఘ నేతలు కోసూరు పూర్ణచంద్రరావు, గరికపాటి మారుతి, మత్తి హరిగోపాల్, గరికపాటి నాగభాస్కర గోపాల్, బడే వెంకటేశ్వరరావు, సనకా శ్రీకాంత్, వాకర్ అసోసియేషన్ సభ్యులు కోట యురి గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు శైలజకు పాపయ్యశాస్త్రి పురస్కారం



గుడివాడ : జంధ్యాల పాపాయ్య శాస్త్రి సాహిత్యం ఆబాలగోపాలానికి అర్థమయ్యే విధంగా ఉంటుందని డాక్టర్ కొడాలి సోమసుందరరావు అన్నారు. రాజేంద్రనగర్ గ్రంథాలయంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి వేడుకల సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు పి.వెంకట శైలజకు జంధ్యాల పాపయ్యశాస్త్రి స్ఫూర్తి పురస్కారం-2024 అందజేశారు. డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.వి.జి.ఆంజనేయులు, మానవతా సంస్థ గుడివాడ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ, త్రిభాషా కవి హెచ్.ఆర్ చంద్రం, మోకా సాంబశివరావు, దుగ్గిరాల ఆనంద్‌మోహన్, నరసింహారావు, వసుధ బసవేశ్వరరావు, శ్రీనివాసరావు, నందివాడ ఎంఈవో గూడపాటి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్‌కు అవార్డులు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్‌కు సేవా అవార్డులు దక్కాయి. మహావీర్ 2023-24 అవార్డుల ప్రధానోత్సవం ఆదివారం విజయవాడలో నిర్వహించగా మాజీ జిల్లా లయన్స్ గవర్నర్ జి.ఎం.శంకర్ గుప్తా అవార్డులు ప్రదానం చేశారు. అప్రిసియేషన్ ఉత్తమ క్లబ్ అధ్యక్షుడిగా బొర్రా నాగేశ్వరరావు, కార్యదర్శిగా చలసాని శీధర్, కోశాధికారిగా మేరుగు పెరుమాళ్ళు అవార్డు సాధించారు. ఉత్తమ పర్మినెంట్ సర్వీస్ ప్రాజెక్ట్, మరికొన్ని సేవా అవార్డులు గుడ్లవల్లేరుకు ప్రధానం చేశారు. ఔట్ స్టాండింగ్ రీజియన్ చైర్‌పర్సన్ పి.ఎస్.విజయ్ బాబుకు శంకర్ గుప్తా, జిల్లా లయన్స్ గవర్నర్ గద్దే శేషగిరి, వైస్ గవర్నర్ వి.వి.పి.ఎస్ ఆంజనేయిలు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ దామర్ల శ్రీశాంతి చేతులమీదు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.

గుడివాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

గుడివాడ : డాక్టర్ టి.ఎల్ పెరుమాళ్ళు, పద్మావతి, చలసాని చైదరి రాయన్ జ్ఞాపకార్థం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆసుపత్రి పెద్ద అవుటపల్లి వారిచే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కోతిబొమ్మ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నరాలు, ఎముకల, గుండె సంబంధిత, బి.సి, షుగర్, ఆయాసం వంటి వ్యాధులకు వైద్యసేవలు అందించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రాజేష్ వైద్యసేవలందించారు. రోటరీ పూర్వాధ్యక్షుడు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, సభ్యులు కొల్లి పూర్ణప్రసాద్, మహదేవ దేశాయి, నరహరిశెట్టి ప్రసాద్, డా.చలసాని లలితకుమార్, తుమ్మల ప్రభాకర్, శ్రీహరి, గంటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పులిగడ్డలో మండలి కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ గ్రంథి ప్రసాద్, కోడూరులో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నేతలు

ఘనంగా మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 4 : మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 99 జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పులిగడ్డ టోల్ ప్లాజా వద్ద మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహానికి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంథి భవాని ప్రసాద్‌తోపాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్, మండలి వెంకటేశ్వరరావు, మండలి శేషగిరిరావు, మండలి సుదీర్‌బాబు, మండలి వెంకట రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత పులిగడ్డ ఆక్విడెక్ట్ సమీపంలో స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. **కోడూరు :** మండలి వెంకట కృష్ణారావు 99వ జయం తిని కోడూరు ప్రధాన సెంటర్‌లో ఘ నంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. బండే శ్రీనివాసరావు, మత్రై గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, పూతబోయిన శ్రీనివాసరావు, బచ్చు వెంకటేష్, కడవకొల్లు శ్రీనివాసరావు, బొలిశెట్టి విఠల్ రావు, ముద్దినేని చంద్రరావు, నాగం రఘు, పిల్లి మల్లిఖార్జునరావు, కాగిత రామారావు, తోట సోమశేఖర్, కోట రాంబాబు, పూతబోయిన కరుణ కుమార్, యర్రంశెట్టి దామోదర్, తోట దామోదర్ రావు, కొండవీటి సునీత, కనగాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి సందర్భంగా నాగాయలంక, భావదేవరపల్లి, తలగడదీవిలో మండలి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, భోగాది సోమశేఖర్ ఆధ్వర్యంలో జరుగగా, సజ్జా గోపాలకృష్ణ, తలశిల స్వర్ణలత, కనగాల రాధ, లకనం నాగాంజనేయులు, చిట్టా అన్నపూర్ణయ్య, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి హరి, వెంకటేశ్వరరావు, చిరివేళ్ల నాగరాజు, పద్యాల వెంకట ప్రసాద్, రేమాల మురళీ, రేవు సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను టీడీపీ నేత తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. శ్రీకాకుళం, శీలంవారిపాలెం, వీరమాచినేనిపాలెం, అచ్చెంపాలెం జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మోపిదేవి :** మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, టీడీపీ సీనియర్ నాయకులు నందిగం శంకరరావు తదితరులు వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావూరి రామకృష్ణ, జనార్దన్, చందన రంగారావు, రావి రత్నగిరి, బళ్లా సీతారామ ప్రసాద్, పీతా కనకయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

అవనిగడ్డ : మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కోడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడుపూతబోయిన సీతారత్న సాయిబాబు నేతృత్వంలో 123 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎక్కువ సార్లు రక్తదానం చేసిన దాదాపు 20 మందికి రక్షణ శాస్త్రవేత్త సతీష్ రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి దుర్గా ప్రసాద్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతులమీదుగా మెమొంటోలు అందజేశారు. మన అవనిగడ్డ బ్లడ్ డోనర్స్ గ్రూపు నిర్వాహకుడు ఇమ్మిడిశెట్టి వెంకటేష్ సహకారం అందించగా, దివి ప్రాంతానికి చెందిన ఆరు మండలాల రక్తదాతలు పాల్గొన్నారు.



హిందూ కళాశాల హైస్కూల్ 1981-82 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్ఫూర్తిదాయకం

● 42 ఏళ్ల మధుర స్మృతులు పంచుకున్న హిందూ కళాశాల హైస్కూల్ 1981-82 బ్యాచ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 : హిందూ కళాశాల హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ, హిందూ కళాశాల సంస్థల చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. హిందూ కళాశాల హైస్కూల్ 1981-82 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఏడో సమ్మేళనం కన్వీనర్ జంధ్యాల శ్రీకృష్ణ నేతృత్వంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీ మందిరం కళావేదికపై ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా విచ్చేసిన కొనకళ్ల మాట్లాడుతూ, తాను విద్యనభ్యసించిన పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూర్వవిద్యార్థులు పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని, నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. హైదరాబాద్, చెన్నై, రాజమండ్రితో పాటు రాష్ట్రం నలుమూల నుంచి 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని మధురానుభూతులను పంచుకున్నారు. పూర్వ విద్యార్థి, రంగనాయకస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యం సమావేశానికి విచ్చేసిన పూర్వవిద్యార్థులను పరిచయం చేస్తూ చలోక్తులతో ఆద్యంతం నవ్వులు పూయించారు. తమతో విద్యనభ్యసించి హైదరాబాద్‌లోని కేశవరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నత స్థాయికి చేరిన మల్లీశ్వరిని ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళనంలో బాలాజీ విద్యాలయం కరస్పాండెంట్ కొమరగిరి చంద్రశేఖర్, ప్రముఖ వ్యాపారవేత్తలు మానేపల్లి సత్యనారాయణ, తమ్మన రవిశంకర్, ఎల్ఐసీ ఆఫీసర్ జయశ్రీ, మాజీ కార్పొరేటర్ భోగిరెడ్డి వెంకటేశ్వరరావు, భట్టిప్రోలు మోహనకృష్ణ, కృష్ణమూర్తి, గొర్రె హరిబాబు, వివిధ ప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాల్గొని ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు.

మహాలక్ష్మమ్మకు ఆషాఢ సారె



నాగాయలంక : సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొర్లగొంది గ్రామంలో మహాలక్ష్మమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను మహిళలు, గ్రామస్థులు సమర్పించారు. రామాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో 500 మంది భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ధర్మ ప్రచారక్ ఆళ్ల జయశంకర్, విద్యా వలంటీరు బచ్చు ఆదినారాయణరావు, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **కోడూరు :** గంగానమ్మకు మెరకగౌడపాలెం గ్రామస్థులు భక్తిప్రపత్తులతో ఆషాఢ సారె సమర్పించారు. గొల్లపాలెం రోడ్డులోని వినాయకుని ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా 21 రకాల స్వీట్లు, పూలు, పండ్లు, కుంకుమ, పసుపు, పాలపొంగళ్లు తెచ్చి అమ్మవారికి సమర్పించారు.

శాకంబరిగా గంగానమ్మ



కోడూరు : గంగానమ్మ అమ్మవారు ఆదివారం శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్థుల ఆర్థిక సౌజన్యంతో ఆలయం మొత్తం వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పామర్రులో గంగానమ్మ..



పామర్రు : పామర్రు పట్టణ గ్రామదేవత గంగానమ్మ ఆదివారం శా కంబరీదేవిగా దర్శనమిచ్చింది. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దరనమిచ్చారు. అమావాస్య కావ డంతో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

విద్యార్థిని ఫీజుకు ఆర్థిక సాయం

ఘంటసాల : శ్రీకాకుళం గ్రామంలో సూరపనేనివారిపాలెంకి చెందిన రాచూరి గురుప్రసాద్ కుమార్తె ఎంసెట్‌లో మంచి మార్కులు తెచ్చుకుని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధించింది. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా విద్యార్థి హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ చిన్నా, జనసైనికులు అందజేశారు.

సూర్యనారాయణస్వామికి చందన అలంకారం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు సూర్యనారాయణస్వామికి అమావాస్య సందర్భంగా చందన అలంకారాన్ని ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి (నాని) ఆధ్వర్యంలో నిర్వహించారు. చందన అలంకారంలో స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మాదివాడ సీతారామాంజనేయులు - నాగసిరి దంపతులు, అప్పికట్ల బాలకృష్ణ - దివ్య దంపతులు స్వామివారి శాంతి కళ్యాణం జరిపించారు. అనంతరం తుంగల ప్రవీణ్ తండ్రి రాము (మునసబు) పేరిట అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

మొక్కలను నాటిన ఆలయ ధర్మకర్త

నాగాయలంక : గణపేశ్వరంలో కొలువైన దుర్గా గణపేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త మండల రాంబాబు ఆదివారం కొబ్బరి మొక్కలను పెట్టారు. నాగాయలంకకు చెందిన వాణిజ్య ప్రముఖుడు చిట్టా శివ నాగేశ్వరరావు 60 మొక్కలు వితరణ చేశారు.

కూచిపూడి ఎస్సై శ్రీనివాస్ బదిలీ

కూచిపూడి : పామర్రు సర్కిల్ పరిధిలోని కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్సై టి.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపారు. అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని నాగాయలంక స్టేషన్ ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యాన్ని కూచిపూడికి బదిలీ చేస్తూ ఎస్పీ గంగాధర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

పేకాట, కోడిపందెపురాయుళ్ల అరెస్టు

పమిడిముక్కల : మర్రివాడలో ఆదివారం కోడిపందేలు వేస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,020 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. అగినపర్రులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ. 3,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిరంజీవి యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా భోగాది



నాగాయలంక : చిరంజీవి యువత కమిటీని ఆదివారం విజయవాడలో ప్రకటించారు. నాగాయలంకకు చెందిన భోగాది శివ విష్ణువర్ధన్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. శివ విష్ణువర్ధన్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 : బందరులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆదివారం రెండో డివిజన్‌లో ఆయన పర్యటించారు. రూ.16 కోట్లతో చేపట్టిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులను పరిశీలించారు. గత ప్రభుత్వం ప్లాంట్ పనులు నిలిపివేయడం వల్ల అదనంగా మరో రూ.5 కోట్లు వెచ్చించాల్సి వస్తోందన్నారు. డ్రెయిన్లలో పూ డికతీత పనులు చేపట్టామన్నారు. నగర ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తామన్నారు. గ్రీనరీ అభివృద్ధి చేసి నగర సుందరీకరణకు పెద్ద ఎత్తున ప్రణాళిక రూపొందించామన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రెండేళ్లలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాపిరాజు, పబ్లిక్ హెల్త్ డీఈ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మోపిదేవి : స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్ పర్సన్ బాలాజీ విజ్ఞప్తి చేశారు. మండలి వెంకట కృష్ణారావు జయంతిని పురస్కరించుకుని మెరకనపల్లిలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్, సెంటిని హాస్పటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపిచంద్, డాక్టర్ కాగిత కృష్ణచంద్, భానుచంద్ 300 మందికి పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ భవిరి శంకర్ నాథ్, గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి, మోపిదేవి ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ అధ్యక్షులు యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఆర్.సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు కొల్లి మురళీ, పరుచూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎంపీ బాలశౌరి జనసేన సభ్యత్వ నమోదు పరిశీలన



మచిలీపట్నం టౌన్ : జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. జనసేన కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాలశౌరి పరిశీలించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడారు. నాల్గవ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఇప్పటి వరకు 12 లక్షల మంది సభ్యులుగా చేరారన్నారు. మచిలీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేస్తామన్నారు. మెడికల్ కళాశాలలో పూర్తి స్థాయిలో వైద్యులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖ, తిరుపతి రైళ్లను ఈనెల 11 నుంచి పునరుద్ధరించామన్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆయిల్ రిఫైనరీ సంస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు గడ్డం రాజు, కార్పొరేటర్లు, సర్పంచ్ గల్లా తిమోతి తదితరులు పాల్గొన్నారు.